క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం చిన్మయి ధ్యానమందిరం ఏరియా, వాటర్ ట్యాంక్ రోడ్డు, పటేల్‌వారి వీధి, ఎస్‌బీఐ ఏరియా, వీఎం రంగా బొమ్మ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

3 నుంచి గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

విజయవాడరూరల్: వచ్చే నెల 3వ తేదీ నుంచి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి వారం మంగళ, బుధవారాల్లో గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. పంటలను సాగు చేసే విషయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించడానికి అధికారులు తగిన సూచనలు, సలహాలు ఇస్తారని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం, సస్యరక్షణ చర్యలు, నీటియాజమాన్య పద్ధతులు, వ్యవసాయ యంత్రీకరణ తదితర అంశాలపై రైతులకు వివరిస్తామన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తతో పాటు ఉద్యాన, వెటర్నరీ, సెరీకల్చర్, మత్స్యశాఖతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. నాలుగు నెలల పాటు ఈ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు.

అల్లాపురంలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల క్లీనింగ్


అల్లాపురం(గన్నవరం): మండలంలోని అల్లాపురం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ డొక్కు సాంబశివవెంకన్నబాబు పర్యవేక్షణలో బుధవారం తాగునీటి వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. పలు వార్డుల్లో డ్రెయిన్లలో పూడికలు తొలగించి బ్లీచింగ్ చల్లించారు. దోమల వ్యాప్తిని నివారించేందుకు మందులు పిచికారీ చేయిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. సీజనల్ వ్యాధుల నివారణకు ఇంటింటికీ వైద్య సిబ్బంది వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారన్నారు. ఏఎన్‌ఎం శ్రీదేవి, ఆశ వర్కర్ సుజాత, పలువురు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి పరిశీలన



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు బుధవారం పరిశీలన చేశారు. విజయవాడ – ఏలూరు సెక్షన్ పరిధిలో ఎల్‌సీ నంబర్ 331 రైల్వే గేటు వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మించాలనే ప్రతిపాదన గత కొన్ని సంవత్సరాలుగా ఉంది. ఈ నేపథ్యంలో రైల్వే అధికారులతో పాటు విద్యుత్, ఎన్‌హెచ్‌ఏఐ, ఆర్ అండ్‌బీ, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన చేశారు. ఆమోదయోగ్యమైన ఎలైన్‌మెంట్ రూపకల్పన చేస్తామని గ్రామస్తులతో చెప్పారు. రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రవికుమార్, పీడబ్ల్యూఏ పాండురంగారావు, విద్యుత్ ఈఈ ఎస్.కోటేశ్వరరావు, డీఈఈ చిట్టిబాబు, పంచాయతీ రాజ్ ఈఈ ఎ.వి.ఎస్.స్వామి, ఆర్‌అండ్‌బీ ఏఈ ఎంవీ నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వీరపనేనిగూడెం జెడ్పీ హైస్కూల్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు



గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేనిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రకటించినట్లు హెచ్‌ఎం జి.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 2023–24 విద్యా సంవత్సరంలో పాఠశాల క్రీడల్లో ఈ పాఠశాల క్రీడాకారులు ప్రతిభ కనబరచటంతో ఈ అవార్డు లభించింది. మచిలీపట్నంలో గురువారం జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అవార్డును అందజేస్తారని హెచ్‌ఎం చెప్పారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభచాటి అవార్డు రావడానికి కృషి చేసిన పాఠశాల పీడీ సీహెచ్ బాలకృష్ణను హెచ్‌ఎం, విద్యా కమిటీ చైర్మన్ మెట్లపల్లి రారాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

స్టెల్లాలో ఉచిత వైద్య శిబిరం

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని, అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ఉండాలని స్టెల్లా కళాశాల కరస్పాండెంట్ లీనా క్వాడ్రస్ అన్నారు. స్టెల్లా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని సంధ్యా ఐ హాస్పిటల్, రోహన్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దంత సంరక్షణ, చికిత్స, కంటి చూపు శుక్లాల పరీక్షలు చేశారు.

నిరంతరం రక్షణ చర్యలు చేపట్టాలి..



హాస్పిటల్స్ వద్ద నిరంతరం రక్షణ చర్యలు చేపట్టాలి. ప్రధానంగా రాత్రి సమయంలో పోలీసు బీట్లు కచ్చితంగా ఏర్పాటు చేయాలి. అన్ని ప్రాంతాలు కవర్ అయ్యేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. పేషెంటుకు సంబంధం లేని వ్యక్తులు హాస్పిటల్స్‌లో ప్రవేశించకుండా చూడాలి. వైద్యులు, సిబ్బందికి ఇబ్బందులు తలెత్తకుండా రక్షణ ఏర్పాట్లు చేయాలి. సెంట్రల్ ప్రొటెక్షన్ లా ను పటిష్టంగా అమలు చేయాలి.

– డాక్టర్ కె.వాణి, ఉంగుటూరు పీహెచ్‌సీ



నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

మహిళలు, కార్మికుల సంరక్షణకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. పని ప్రాంతాల్లో ఘోరాలు, దారుణాలు జరుగుతున్నాయి. మహిళలు అన్ని విధాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోల్‌కతా హాస్పిటల్స్ జరిగిన సంఘటన బాధాకరం. అఘాయిత్యాలు పునరావృతం కాకుండా పటిష్టమైన భద్రత చర్యలు తీసుకోవాలి. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– తాడంకి నరేష్, సీఐటీయూ మండల కార్యదర్శి, కంకిపాడు



స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని వెనక్కి తీసుకోవాలి

- విద్యుత్ ఉద్యమ అమర వీరుల సంస్మరణ సభలు
- నివాళులర్పించిన నాయకులు



గన్నవరంలో నివాళులర్పిస్తున్న వామపక్ష నేతలు

కంకిపాడు: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సీపీఎం కృష్ణా జిల్లా కమిటీ సభ్యుడు పి.రంగారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని మండేపూడి భవన్‌లో విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. రంగారావు మాట్లాడుతూ.. పదేళ్లుగా కేంద్రంలో బీజేపీ విద్యుత్ రంగ దోపిడీ తీవ్రం చేసిందని విమర్శించారు. విద్యుత్ రంగం మొత్తాన్ని అదానీ, టాటా వంటి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందన్నారు. కార్పొరేట్ల దోపిడీ, ప్రైవేటీకరణ, అవినీతి పాలన కారణంగా ప్రజలపై విద్యుత్ భారాలు పడుతున్నాయని చెప్పారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచుకునేందుకు సిద్ధమైందన్నారు. ఈ చర్యను ఉపసంహరించుకోకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి టి.నరేష్, ప్రతినిధులు వి.శివశంకర్, జి.కుమారి, వి.జాన్‌మోజేస్, వి.మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు మోపేందుకు సిద్ధమైన ప్రభుత్వం

గన్నవరం: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రంగంలో అమలు చేస్తున్న స్మార్ట్ మీటర్లను ప్రజలందరూ వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా నాయకులు కళ్ళం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో బుధవారం వామపక్షాల ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యమ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్ళం మాట్లాడుతూ.. విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపేందుకు పాలకులు సిద్ధమయ్యారని చెప్పారు. దీనిలో భాగంగా టీడీపీ ప్రభుత్వం చాప కింద నీరులా స్మార్ట్ మీటర్ల విధానం తీసుకువచ్చిందన్నారు. ఇదే జరిగితే సెల్‌ఫోన్‌లు మాదిరిగా విద్యుత్ కోసం రీ చార్జి చేసుకోవాల్సిన పరిస్థితి వస్తోందని చెప్పారు. స్మార్ట్ మీటర్ల విధానం చూస్తే గ్యాస్ సబ్సిడీ మాదిరి అవుతుందని సీపీఐ నాయకులు కాట్రగడ్డ జోషి విమర్శించారు. తొలుత విద్యుత్ ఉద్యమంలో పోలీసుల కాల్పులకు బలైన రామకృష్ణ, విష్ణువర్ధనరెడ్డి, బాలస్వామికి నివాళులర్పించారు. వామపక్ష నేతలు మల్లంపల్లి ఆంజనేయులు, అనుమోలు వెంకటేశ్వరరావు, కొండా వీరాస్వామి, తిరివీధి సుబ్బారావు, విజయరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ అమరవీరులకు నివాళులు



పోరంకిలో నివాళులర్పిస్తున్న సీఐటీయూ నేతలు

పెనమలూరు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ పాలన సమయంలో బషీర్‌బాగ్ కాల్పుల్లో మృతి చెందిన అమరులకు పోరంకిలో కార్మికులు బుధవారం ఘన నివాళులర్పించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో 24 సంవత్సరాల క్రితం విద్యుత్ ఉద్యమంలో టీడీపీ ప్రభుత్వం జరిపించిన తుపాకీ కాల్పుల్లో అసువులుబాసిన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిల చిత్రపటాలకు కృష్ణా జిల్లా సీఐటీయూ నాయకురాలు ధనశ్రీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధనుశ్రీ మాట్లాడుతూ.. అప్పటి టీడీపీ ప్రభుత్వం జరిపించిన తుపాకీ కాల్పుల్లో ముగ్గురు ఉద్యమకారులు అమరులయ్యారని తెలిపారు. అప్పటి నుంచి ప్రభుత్వాలు కరెంట్ చార్జీలు పెంచాలంటే భయపడే పరిస్థితి వచ్చిందన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి, నాయకులు పుసునూరు పాతాళలక్ష్మి, పి.సత్యనారాయణ, వై.సరళ, విజయ, కార్మికులు పాల్గొన్నారు.

జ్వరాల నియంత్రణకు కలెక్టర్ జోక్యం చేసుకోవాలి



ముస్తాబాద పీహెచ్‌సీలో జ్వర బాధితులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి

గన్నవరంరూరల్: మండలంలో పెరుగుతున్న జ్వరాలను అదుపు చేసేందుకు జిల్లా కలెక్టర్ బాలాజీ తక్షణమే జోక్యం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి కోరారు. ముస్తాబాద పీహెచ్‌సీని బుధవారం ఆమె సందర్శించి, జ్వర బాధితులతో మాట్లాడారు. అనంతరం డాక్టర్ జి.సృజనను కలిసి సీజనల్ జ్వరాలు, డెంగీ కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయటం, బ్లీచింగ్ పౌడర్ చల్లించటం, మెడికల్ సిబ్బందిని ఇంటింటికీ పంపి సర్వే విస్తృతంగా చేయాలన్నారు. ప్రజలు జ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతూ లక్షల్లో ఖర్చులు చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారని, వెంటనే చర్యలు తీసుకుని ప్రజారోగ్య రక్షణ చేపట్టాలని కోరారు.

వికసిత ఏపీకి ప్రణాళికలు సిద్ధం చేయండి



పెనమలూరులో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సునీతాశర్మ

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వికసిత ఆంధ్రప్రదేశ్ -2047కు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ సునీతాశర్మ ఆదేశించారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా శాఖలు భవిష్యత్తులో చేపట్టే అభివృద్ధి, సంక్షేమంపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. అందుబాటులో ఉన్న వనరులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, ఏఓ లోయ శివశంకర్‌రావు, ఎస్‌ఐ రాజేష్, ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు నియోజకవర్గ సమావేశం

వికసిత ఆంధ్రప్రదేశ్‌పై ఈ నెల 30వ తేదీన పెనమలూరు నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తామని ఏఓ లోయ శివశంకర్‌రావు తెలిపారు. కానూరు ధనేకుల కల్యాణ మండపంలో సమావేశం ఉదయం 10 గంటలకు జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని చెప్పారు.

అల్లాపురంలో యథేచ్ఛగా మట్టి దోపిడీ



మట్టి దోపిడీ జరిగిన వాగు గట్టు ప్రాంతం

గన్నవరం: మండలంలోని అల్లాపురం గ్రామంలో మట్టి దొంగలు హల్‌చల్ సృష్టిస్తున్నారు. విమానాశ్రయం ప్రహరీ పక్కన డ్రెయిన్ కోసం తవ్విన మట్టిని ట్రాక్టర్లతో రాత్రికి రాత్రి బయటకు తరలించి సొమ్ము చేసుకున్నారు. అధికార పార్టీ అండదండలతో జరిగిన ఈ మట్టి దోపిడీ వ్యవహారం రెవెన్యూ అధికారులకు తెలిసిన నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలో ఏలూరు కాలువ సమీపంలో ఎయిర్‌పోర్ట్ విస్తరణ కోసం సరిహద్దు వాగును విమానాశ్రయ ప్రహరీ పక్క నుంచి మళ్లించారు. దీనికోసం తవ్విన మట్టిని వాగు పక్కనే గట్టులుగా పోశారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన టీడీపీ నేతల కన్ను సదరు మట్టి గుట్టలపై పడింది. ఆ పార్టీకి చెందిన బోలెం శివశంకర్ నేతృత్వంలో 10 రోజుల క్రితం మట్టి దోపిడీకి పాల్పడ్డారు. ప్రొక్లెయిన్‌ను ఏర్పాటు చేసి రాత్రికి రాత్రి 15 ట్రాక్టర్లతో సుమారు 300 ట్రక్కుల మట్టిని ప్రైవేట్ స్థలాల్లో మెరకకు విక్రయించారు. అక్రమ మట్టి తరలింపును అడ్డుకున్న నైట్‌బీట్ పోలీసులకు బందరు మాజీ ఎంపీ తాలుకా అని చెప్పడంతో వదిలివేసినట్లు సమాచారం. మట్టి దోపిడీపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి దోపిడీకి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గృహ సముదాయాలకు ఇబ్బంది లేకుండా రైల్వే ఓవర్ బ్రిడ్జి



పెద్ద అవుటపల్లిలో ఆర్‌ఓబీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ విమలకుమారి, అధికారులు

ఉంగుటూరు: గృహ సముదాయాలకు ఇబ్బంది లేకుండా రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు తహసీల్దార్ విమల కుమారి తెలిపారు. మండలంలోని తేలప్రోలు – బండారుగూడెం, పెద్ద అవుటపల్లి – వీరపనేనిగూడెం ఆర్‌అండ్‌బీ రహదారుల్లో ఆర్‌ఓబీ నిర్మించేందుకు బుధవారం రెవెన్యూ, రైల్వే, ఆర్‌అండ్‌బీ, విద్యుత్‌శాఖ అధికారులు సంయుక్త పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ప్రతిపాదించిన స్థలంలో విద్యుత్, తాగునీరు వంటి వాటికి అంతరాయం కలుగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చర్చించారు. ప్రతిపాదనలు ఆమోదించిన తరువాత బ్రిడ్జి నిర్మాణం పనులు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీహరి, ఎలక్ట్రికల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, వీఆర్వోలు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

సాయిబాబా విగ్రహం ప్రతిష్ఠ



పెనమలూరు: తాడిగడప గ్రామంలోని గ్రీన్ సిటీ కాలనీలో బుధవారం శ్రీషిరిడి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఉప్పలపాటి రత్నశేఖర్, మన్నే సుబ్బారావు దంపతులు సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. కాలనీ వాసులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు గద్దెరామమోహన్, బోడెప్రసాద్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. దాతలు, కాలనీ అసోసియేషన్ సహకారంతో రెండు వేల మందికి అన్నసమారాధన కార్యక్రమం చేశారు.

ఈడుపుగల్లు మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుల మార్పు

కంకిపాడు: ఈడుపుగల్లు మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులను మార్పు చేస్తూ విద్యాశాఖ చర్యలు తీసుకుంది. వివరాల్లోకి వెళితే... గ్రామంలోని చెరువు కట్ట వద్ద గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మండవ వెంకట శ్రీనివాస్ ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించటంతో అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన తెలిసిందే. దీంతో తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో గ్రామస్తులు టీచర్లందరినీ మార్పు చేయాలన్న డిమాండ్ వ్యక్తం చేశారు. ఎంఈఓ ప్రసాద్ నివేదిక ఆధారంగా డీఈఓ స్పందించి మార్పునకు అవకాశం కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం పి.రూప వాణిని పునాదిపాడుకు మార్చారు. ఈడుపుగల్లు మోడల్ స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎంగా మీనాకుమారికి బాధ్యతలు అప్పగించారు. కోలవెన్ను నుంచి రంగమాధవి, క్రిస్టియన్‌పేట నుంచి లావణ్యను ఈడుపుగల్లు మోడల్ స్కూల్‌కు అత్యవసర ప్రాతిపదికన కేటాయించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలతో బుధవారం ఈ మార్పులు చేసినట్లు ఎంఈఓ ప్రసాద్ తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రోగ్రామ్ మేనేజర్ శేఖర్‌బాబు

నున్న(విజయవాడరూరల్): మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ జి.శేఖర్‌బాబు తెలిపారు. నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో సచివాలయం, పారిశుధ్య సిబ్బందికి మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం మానసిక వ్యాధి అన్నారు. వీటికి అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువులు వదిలి సర్వస్వం కోల్పోయి నిరాభాగ్యులవుతున్నారని చెప్పారు. మత్తు మందులకు బానిసలయ్యే వారికి హృద్రోగ సంబంధమైన సమస్యలు, క్యాన్సర్, రోడ్డు ప్రమాదాల్లో గాయపడటం, మానసిక అనారోగ్యం వంటి సమస్యలు వస్తాయన్నారు. జూదం, సైబర్ సంబంధమైన వ్యసనాలు, లైంగిక వ్యసనాలు, పోర్నోగ్రఫీ, ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలవుతారని చెప్పారు.

నీ తోడు మానసిక కేంద్రం సేవలు

సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ఉపయోగించాలనే అతి నియంత్రిత కోరికతో జీవితంలో అనార్థాలు వస్తాయన్నారు. భావోద్వేగ స్థితులలో ప్రతికూలమైన మార్పుకు దారి తీస్తుందని, మెదడుపై తీవ్ర ప్రభావం చూపడం వల్ల శారీరకంగానూ, మానసికంగాను మరింత ప్రభావం చూపుతాయన్నారు. మాదకద్రవ్య వ్యసనాన్ని అధిగమించడానికి డాక్టర్లు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహాయక బృందాలు వ్యవస్థీకృత చికిత్స సహాయం కోసం నవజీవన్ బాల భవన్ ద్వారా నీ తోడు మానసిక వికాస కేంద్రాన్ని లేదా 94904 92020 ఫోను నంబర్‌లో సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో జోనల్ కో ఆర్డినేటర్ డి.వెంకటేశ్వరరావు, సచివాలయ కార్యదర్శి అజేంద్ర, వెల్ఫేర్ ఆఫీసర్ మీనాదేవి, అసిస్టెంట్ మాళవిక, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు




దోమల మందు స్ప్రే చేస్తున్న సిబ్బంది

నున్న(విజయవాడరూరల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టారు. నున్న గ్రామంలో మురుగుకాల్వల్లో మలాథియన్ మందును ట్రాక్టర్ ద్వారా స్ప్రే చేస్తున్నారు. లార్వా గుడ్డు దశ నుంచి అభివృద్ధి కాకుండా ఉండేందుకు నిర్మూలించడం ద్వారా దోమలను నివారించవచ్చునని గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ తెలిపారు. నున్న గ్రామంలో ప్రధానంగా గౌడబజారు, కుమ్మర్ల బజారు, కోటకట్ట సెంటర్ వద్ద మాంసం దుకాణాలు, బోడపాడులోని మాంసం దుకాణాలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో దోమలు ఉధృతి అధికంగా ఉండటంతో ఆ ప్రాంతాల్లోనూ మలాథియన్ స్ప్రేయింగ్ చేస్తున్నారు. వారానికి ఒకసారి అన్ని వీధుల్లో స్ప్రేయింగ్ చేస్తున్నామని కార్యదర్శి తెలియచేశారు. అలాగే పాతపాడు, పి.నైనవరం,అంబాపురం గ్రామాల్లోనూ దోమల నివారణకు మందు స్ప్రే చేస్తున్నారు. టైఫాయిడ్, మలేరియా జ్వరాలు రాకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పెద్దిరావు ప్రజలకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

అత్యావసర వేళ స్పందించని 108, ఆస్పత్రి వర్గాలు



గన్నవరం: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం రాత్రి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో హైవేపై జరిగింది. బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామానికి చెందిన వినోద్ బుధవారం రాత్రి బైక్‌పై విజయవాడ వైపు వెళ్తున్నాడు. వేగంగా ముందు వెళ్తున్న మరో బైక్‌ను గమనించి సడన్ బ్రేక్ వేసి దానిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి 108కు ఫోన్లు చేశారు. అరగంట వేచివున్న అంబులెన్స్ రాలేదు. పరిస్థితి విషమంగా మారడంతో స్థానికులు ఆటోలో సమీపంలోని పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రికి తరలించారు. రాత్రి వేళలో ప్రమాద కేసులకు చికిత్స చేయడం లేదని ఆస్పత్రి వర్గాలు చెప్పగా విని అంతా విస్తుపోయారు.

ఉద్యోగుల బదిలీల హడావుడి

- నేడు సచివాలయ ఉద్యోగులకు కౌన్సెలింగ్
- మండల పరిషత్–మున్సిపాలిటీలో సిఫార్సులు



పెనమలూరు మండల పరిషత్ కార్యాలయం

పెనమలూరు: మండల పరిధిలో ఉద్యోగుల బదిలీల హడావుడి జరుగుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగుల బదిలీలపై చర్యలు చేపట్టింది. దీంతో మండల పరిధిలో ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తులు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలో 30 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. సచివాలయాల ఉద్యోగులకు బదిలీలకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దీంతో ఇప్పటికే దాదాపు 50 మంది సచివాలయాల ఉద్యోగులు దరఖాస్తు డౌన్‌లోడ్ చేసి బదిలీలకు దరఖాస్తు చేశారు. సచివాలయాల ఉద్యోగులకు గురువారం బదిలీలపై కౌన్సెలింగ్ చేయనున్నారు.

మండల పరిషత్‌లో సిఫార్సులు

కాగా పెనమలూరు మండల పరిషత్‌లో బదిలీలపై పెద్ద ఎత్తున సిఫార్సులు జరుగుతున్నాయి. ఎంపీడీఓ, ఏఓతో పాటు మండల పరిషత్ సిబ్బంది బదిలీ కానున్నారు. 5 సంవత్సరాల కాలపరిమితి ముగియటంతో మండల పరిషత్‌లో పోస్టులు అన్ని దాదాపుగా ఖాళీ అవుతున్నాయి. దీంతో ఎంపీడీఓ, ఏఓ పోస్టులతో పాటు ఇతర పోస్టులకు సిఫార్సు లెటర్ ఉంటేనే ఇక్కడ పోస్టింగ్ వచ్చే పరిస్థితి ఉంది. ఇప్పటికే ఎంపీడీఓ పోస్టు మహిళా అధికారికి ఖరారైనట్లు తెలిసింది. ఇప్పటికే సిఫార్సు లెటర్లు మండలానికి వచ్చే ఉద్యోగుల చేతికి అందాయని సమాచారం. ఈ నెల 30వ తేదీ నాటికి బదిలీలు జరగనున్నాయి.

మున్సిపాలిటీలో..

వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో బదిలీలకు ఉద్యోగులు దరఖాస్తు చేశారు. సీనియర్ అసిస్టెంట్‌లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఇతర పోస్టుల్లో బదిలీలు జరగనున్నాయి. తాడిగడప మున్సిపాలిటీకి మంచి డిమాండ్ ఉండటంతో ఇక్కడ పోస్టింగ్ కోసం ఉద్యోగులు పైరవీలు చేసుకుంటున్నారని సమాచారం. బదిలీల కారణంగా సాధారణ పరిపాలన నత్తనడకన సాగుతుంది.

రూ.25 కోట్లతో రహదారి అభివృద్ధి



హనుమాన్‌జంక్షన్‌రూరల్: కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన వేలేరు – సీతారామపురం – పల్లెర్లమూడి – కొయ్యూరు రహదారి అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి కావటంపై ఆయా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(సీఆర్‌ఐఎఫ్) కింద రూ.25.40 కోట్లతో 15.60 కిలోమీటర్లు మేర నిర్మిస్తున్న ఈ రహదారి పనులు కొయ్యూరు వద్ద శరవేగంగా జరుగుతున్నాయి. బాపులపాడు మండలం వేలేరు వద్ద జాతీయ రహదారి నుంచి ఏలూరు జిల్లా నూజివీడు మండలం సీతారామపురం, పల్లెర్లమూడి గ్రామాల మీదగా కొయ్యూరు చేరుకుని బొమ్ములూరు వద్ద తిరిగి నేషనల్ హైవేను కలుపుతూ ఈ రహదారిని 7 మీటర్ల వెడల్పుతో విస్తరించారు. ఈ రోడ్డు అభివృద్ధికై నిధులు మంజూరుకు సహకరించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని సామాజిక కార్యకర్త అట్లూరి రమేష్‌తో పాటుగా పలువురు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పత్రికా ప్రకటన

[illegible]

గాదె హరేంద్రనాథ్ రెడ్డి, D.A.E., B.A., B.L., అడ్వకేట్, హెచ్ నెం.15-1-[illegible], రోడ్ నెం. 13, [illegible], ఖమ్మం-507 002. తెలంగాణ. 98480 [illegible]